RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 285 | అక్టోబర్ 17, 2025 | వెల : రూ.3-00



వీధి కుక్కల ఉగ్రరూపం

4లో..

- జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితా తప్పుల తడక!
- ఉన్నవారికే రెండు, మూడు ఓట్లు..అలా ఎలా?
- బైపోల్ టార్గెట్‌గా బోగస్ ఓట్ల చేరిక
- ఓటున్న వారికే మళ్లీ ఓటు హక్కు ఎలానో మరి?
- బోగస్ ఓట్లపై ఈసీకి 12 వేల కంప్లయింట్స్



# బోలెడు మిస్టేక్స్..!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**

మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కు ప్రచారం రసవత్తరంగా సాగుతున్నది. సెంటిమెంటు అస్త్రంతో బీఆర్ఎస్, అభివృద్ధి, సంక్షేమ ప్రచారంతో కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం అండ, కేంద్ర పథకాలు క్యాంపెయిన్ చేస్తూనే.. ముందుకు సాగాలని బీజేపీ భావిస్తున్నాయి. అయితే, బై పోల్ సమీపిస్తున్న కొద్దీ ఓటర్ల జాబితాలో తప్పుల తడకలు వెలుగు చూస్తున్నాయి. ఉపఎన్నికే లక్ష్యంగా కొంతమంది బోగస్ ఓట్లు చేర్పించినట్లు సమాచారం. చాలా దరఖాస్తులను పరిశీలించకుండానే ఆమోదించినట్లు ఓటర్ల జాబితా చూస్తే స్పష్టం కానుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి 3,85,265 ఓట్లు ఉండగా, ప్రస్తుతం 13,717 మంది ఓటర్లు పెరిగారు. ఈ నెల 11 వరకు అందిన మరో 2 వేల దరఖాస్తులు ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. మార్పులు చేర్పులు, మృతులు, ఇతర ఓటర్ల తొలగింపు ప్రక్రియలన్నీ పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 30 వేల మందిని కొత్తగా చేర్పించినట్లు వినికిడి.

**ఓట్లున్న వారికే మళ్లీ ఓటు హక్కు?**

ఇతర నియోజకవర్గాల వారిని కూడా ఈ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేర్పించారు. అక్కడ ఓటు రద్దు చేసుకుంటేనే ఇక్కడ కల్పించాలని రూల్ ఉంది. కానీ పరిశీలన లేకుండానే ఆమోదించారని, దీంతో బోగస్ ఓట్లు నమోదు అయ్యాయని తెలుస్తున్నది. సెప్టెంబరు 2 నుంచి 17 వరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి పరిశీలించి మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్లను నమోదు చేయాల్సి ఉంది. కానీ కొన్నిచోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త ఓటర్లను ఎక్కువ సంఖ్యలో చేర్పించారనే ఊహాగానాలు వస్తున్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు ఇచ్చిన దరఖాస్తులను ఆమోదించారు. దీంతో ఓటున్న వారికే మళ్లీ ఓటు హక్కును కల్పించారు. సెప్టెంబరు 30న తుది జాబితాను సైతం ప్రకటించారు. ప్రస్తుతం కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారిని జాబితాలో అదనంగా చేర్చనున్నారు. ఒకే ఇంటి నంబరుపై దాదాపు 49 ఓట్లున్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. కృష్ణానగర్ లోని ఒక గ్రూప్ హౌస్ లో 23 మంది ఉంటే, 49 ఓట్లు నమోదు అయ్యాయి. మరో ఇంట్లో 20 మంది ఉంటే కేవలం 3 ఓట్లే వచ్చాయి. ఇలా సెగ్మెంట్ పరిధిలో బోగస్ ఓట్లు ఉన్నాయనే వాదన కూడా ఉంది. బోగస్ ఓట్ల విషయమై బోలెడు మతలబులు ఉన్నాయని కొందరు పేర్కొంటున్నారు. వీటిపై ఎన్నికల సంఘానికి ఏకంగా 12 వేల ఫిర్యాదులు కూడా అందాయి. చూడాలి మరి అధికారులు విచారణ జరిపి ఏ మేరకు ఓటర్ల జాబితాలోని తప్పులు సవరిస్తారో..



## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌ను పరామర్శించిన సీఎం

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావును పరామర్శించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆసుపత్రికి వెళ్లిన రేవంత్ రెడ్డి, వైద్యులతో మాట్లాడి ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రేమ్ సాగర్ రావు మా పార్టీలో ముఖ్యమైన నాయకుడు, మంచిర్యాల ప్రజల ప్రతినిధి. అతను త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము. వైద్యులు అందించే చికిత్సకు అన్ని సహకారాలు అందిస్తాము" అని తెలిపారు. మల్లు భట్టి విక్రమార్క కూడా, "ఈ కష్ట సమయంలో ముఖ్యమంత్రి నాయకత్వం పార్టీ సభ్యులకు బలం ఇస్తుంది. ప్రేమ్ సాగర్ రావు త్వరలో కోలుకుంటారు" అని అన్నారు.

ప్రేమ్ సాగర్ రావు ఇటీవల ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరారు. ఏఐజీ వైద్యులు అధునాతన చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి స్థిరంగా ఉందని, మెరుగుదల కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యుడిగా ప్రేమ్ సాగర్ రావు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అతని ఆరోగ్యం పార్టీలో ఆందోళన కలిగించింది. ముఖ్యమంత్రి సందర్శన పార్టీ ఐక్యతను చాటుతోంది. రేవంత్ రెడ్డి ఆసుపత్రి సదుపాయాలను పరిశీలించారు. తెలంగాణలో ఆరోగ్యశ్రీ, ఇతర ఆరోగ్య పథకాలను మెరుగుపరిచేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. ముఖ్యమంత్రి చర్య పార్టీ ఐక్యతను బలోపేతం చేస్తుందని నాయకులు భావిస్తున్నారు. ప్రేమ్ సాగర్ రావు త్వరిత కోలుకోవాలని అందరూ కోరుకుంటున్నారు.

## సుమంత్ విషయం నాకు తెలియదు

- స్మార్ట్ ఫోన్ చూడటం నాకు రాదు - నన్నెందుకు టార్గెట్ చేస్తున్నారు..? - మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



వరంగల్ జిల్లా తో పాటు రాష్ట్రంలో ప్రస్తుతం మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్ లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం, మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆయన అన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని, ఏమైందో తెలియదని అన్నారు. మంత్రి ఛాంబర్ కు ఇప్పటివరకు తాను వెళ్లలేదని చెప్పారు. తన కుమార్తె, అల్లుడు లండన్ లో ఉన్నారని కొండా మురళి తెలిపారు. అక్కడ వారు వ్యాపారం చేస్తున్నారన్నారు.

మిగతా 3వ పేజీలో..

## లోగో ఆవిష్కరించిన సీఎం

**వేద న్యూస్, హైదరాబాద్:**



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డా. బీ.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అధికార సంస్థ పోలీస్ కంప్లెయింట్ అథారిటీ కోసం రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్ మరియు లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం పోలీస్ వ్యవస్థలో పారదర్శకతను, ప్రజల ఫిర్యాదుల పరిష్కారాన్ని సులభతరం చేయడానికి మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, "పోలీస్ శాఖలో అవినీతి, అన్యాయాలకు వేగవంతమైన పరిష్కారం కోసం పోలీస్ కంప్లెయింట్ అథారిటీ వెబ్ సైట్ కీలకమైన చర్య. ప్రజలు ఇకపై సులభంగా ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు, వాటి స్థితిని ట్రాక్ చేయవచ్చు. ఈ వ్యవస్థ తెలంగాణ పోలీస్ శాఖను మరింత బలోపేతం చేస్తుంది" అని తెలిపారు. ఈ ఆవిష్కరణ ప్రభుత్వ డిజిటల్ గవర్నెన్స్ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, ప్రజల సమస్యలకు త్వరిత స్పందనను అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు,

మిగతా 3వ పేజీలో..

## సంజీవని ఆసుపత్రి ఎదుట ధర్నా

### - మాకు న్యాయం చేయండి : కిరణ్ గౌడ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ముందు గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. భాగస్వామ్య ఆర్థిక లావాదేవీలపై వివాదం తీవ్రరూపం దాల్చడంతో పడాల కిరణ్ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ఎదుట ధర్నా చేపట్టారు. కిరణ్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా తాను దుర్గా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నడుపుతున్నానని, తరువాత సంజీవని హాస్పిటల్ ప్రారంభించే సమయంలో డాక్టర్ సురేష్, ఉడుగుల సురేష్, కిషోర్ కుమార్ ముగ్గురు కలిసి పనిచేద్దామని చెప్పారని వివరించారు. "వారికీ 30 శాతం, నాకు 10 శాతం వాటా ఇస్తామని హామీ ఇచ్చారు. నమ్మకంతో నా ఫర్నిచర్ మొత్తం హాస్పిటల్‌కి ఇచ్చేశాను. కానీ తరువాత నన్ను పూర్తిగా పక్కన పెట్టేశారు," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "గత మూడు సంవత్సరాలుగా నా వాటా గాని, ఫర్నిచర్ విలువ గాని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు డబ్బులు అడిగితే బెదిరింపులు వస్తున్నాయి," అని కిరణ్ ఆరోపించారు. తాను సుమారు యాభై లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని, తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే తాను కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. ఈ వివాదంపై హాస్పిటల్ నిర్వాహకుల స్పందన కోసం ప్రయత్నించినా స్పందించలేదు. కిరణ్ కుటుంబ సభ్యులు హాస్పిటల్‌పై పూర్తి స్థాయిలో విచారణ



వేద న్యూస్

శుక్రవారం అక్టోబర్ 17, 2025

## కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల

# కేర్ టేకర్ గా డాక్టర్ శాగంటి శ్రీనివాస్



**వేద న్యూస్, హన్మకొండ :**

కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్ గా డాక్టర్ శాగంటి శ్రీనివాస్ ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. బిక్షాలు సూపర్ డెంట్ బి. వీరు నాయక్ గురువారం నియమించారు. శ్రీనివాస్ గతంలో దూర విద్యా కేంద్రం కేర్ టేకర్ గా రెండు పర్యాయాలు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాను పనిచేశారు. శ్రీనివాస్ దూర విద్యా కేంద్రం ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా మూడుసార్లు గెలుపొందారు. ప్రస్తుతం దూరవిద్యా కేంద్రం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. శ్రీనివాస్ నియామకం పట్ల ఇంజనీరింగ్ కళాశాల బోధనేతర సిబ్బంది సంజయ్, యాదగిరి, రాజేష్, తిరుమల్ సింగ్, సాయి, ఫిరోజ్, సుమన్, తాజ్, మధు తదితరులు శ్రీనివాస్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# రేపాకలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ వారు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రేపాక చుట్టు ప్రక్కల గ్రామాలు సోమారం పేట, కిష్టాపూర్, ఆరెపల్లె, గుండారం, తాళ్ళల్ల పల్లె, కల్లెపెల్లి గ్రామాలకు చెందిన 130మందికి నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందిని కంటి ఆపరేషన్ కొరకు గుర్తించారు. కంటి ఆపరేషన్ కొరకు గుర్తించిన వారిలో 14 మందిని ఇదే రోజు ఉచిత కంటి ఆపరేషన్ కై ఉచిత వాహనంలో రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ సభ్యులు మాట్లాడుతూ సమాజ సేవే లక్ష్యంగా ప్రతి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.తినడానికి తిండి లేని పేద వారికి ఆహారం, బట్టలు అందించడం, వృద్దులకు చేతికర్రలు అందించడం వంటి సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కంటి చూపు పోయిన వారికి కంటి చూపు తిరిగి తెప్పించాలనే ఉద్దేశ్యంతో నేడు ఈ ఉచిత నేత్ర వైద్య శిభిరం నిర్వహించడం జరిగిందని, మంచి స్పందన వచ్చిందని వారు సంతోషం వ్యక్తంజేశారు.మానవ సేవే మాధవ సేవ అనే విధానంతో సేవా కాసర్యక్రమాలను నిస్వార్త చింతనతో పారదర్శకంగా నిర్వహిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ ఎఫ్ డబ్ల్యూ సి బి. సరళ, ఆర్ సి సంపత్ కుమారి, అధ్యక్షులు పాత కిరణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు మారం ప్రశాంత్, కార్యదర్శి రొండ్ల ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి టి. నాగశేషు, సభ్యులు మంద విష్ణు వర్ధన్ రెడ్డి, ఒంటెల సత్యలక్ష్మి,, ఒంటెల రాఘవేందర్ రెడ్డి, కామిరెడ్డి సదాశివ రెడ్డి, గన్ను రాజిరెడ్డి ఉమ్మెంతల శ్రీనివాస్ రెడ్డి,రేకుర్తి నేత్ర వైద్యాశాల కంటి వైద్య నిపుణులు చింతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో తిది భోజన కార్యక్రమం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**



ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో యం.పీ.పీ.ఎస్, పాఠశాలలో తిథి భోజనం" కార్యక్రమంలో భాగంగా సిరికొండ విక్షిత్, పుట్టినరోజు సందర్భంగా విక్షిత్ తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణి చేశారు. పాఠశాల ప్రాథనోపాధ్యాయులు అచ్చ విజయభాస్కర్, మాట్లాడుతూ,తిది భోజనం అనేది ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఒక కార్యక్రమం. దీని ప్రకారం, ప్రజలు తమ ప్రత్యేక దినోత్సవాలైన పుట్టినరోజులు, పండుగలు, వార్షికోత్సవాల వంటి సందర్భాలలో విద్యార్థులకు అదనపు పోషకాహారాన్ని (పండ్లు, పప్పులు, ఇతర కూరగాయలు వంటివి) అందించడానికి స్వచ్ఛందంగా విరాళం ఇస్తారు. ఇది ప్రభుత్వ పథకానికి ప్రత్యామ్నాయం కాదు, కానీ పాఠశాలల్లో అందించే సాధారణ భోజనానికి అనుబంధంగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవళిక, శరణ్య, నవత, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బంద్ ను విజయవంతం చేయాలి

**వేద న్యూస్, శాయంపేట:**



తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ సాధన లక్ష్యంగా బీసీ జేఏసీ నిర్వహిస్తున్నటువంటి 18వ తేదీన బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ జేఏసీ మండల నాయకులు ముంజల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు ముంజల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడం, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు బ్రేక్ పడడం లాంటి పరిణామాలలో బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. జనాభా ప్రాధిక పదిన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటూ కొన్ని సంవత్సరాలుగా వస్తున్న డిమాండ్ కు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో చేతికి అందించిన అవకాశాన్ని తాజా పరిణామాలు లాగేస్తున్నట్టు చేశాయని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ క్రమంలోనే బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ వర్గాలు నిర్ణయించాయి.ఈ బందుకు విద్యా, వ్యాపార, వాణిజ్య రంగాలు వారు సహకరించాలని కోరారు .42 శాతం రిజర్వేషన్లు ఎవరో ఇచ్చే బిక్ష కాదని ఇది బీసీల హక్కు అని ఆయన తెలిపారు .ప్రభుత్వం పార్లమెంటులో బీసీల 42 శాతం ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.18న బీసీ బంద్ విజయవంతం చేయాలి వారు పిలుపు ఇచ్చారు.

# పత్తి రైతులకు అవగాహన

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు,నర్సక్క పేట గ్రామాలలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, కిసాన్ కపాస్ అప్లికేషన్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ యొక్క కిసాన్ కపాస్ యాపు నందు రైతులు పత్తి పంటను సిసిఐ ద్వారా అమ్ముకోవడానికి ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఉన్నది కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. ఏదైనా క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నట్లయితే సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించి అనుమానాలు నివృత్తి చేసుకోగలరని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం సురేష్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి లలిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వికాసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కు కేయూ

# ఇంజనీరింగ్ కళాశాల కో ఎడ్యుకేషన్ ఎంపిక

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



“వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026” హనంకొండ జిల్లా నిర్వహణకు కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ (కో–ఎడ్యుకేషన్) ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. “వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026” లో పాల్గొనాలనుకునే విద్యార్థులు మై భారత్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమానికి సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో నెహ్రూ యువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ సంతకాలు చేశారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయ నేషనల్ సర్వీస్ స్కీమ్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ, కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ డి. శైలజ, ఎం. సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# బంద్ ఫర్ జస్టిస్ కు సంపూర్ణ మద్దతు

**వేద న్యూస్, వీర్నపల్లి :**



బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మేకల పరిసరాములు సూచన మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీర్నపల్లి మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ.. వీర్నపల్లి మండల వ్యాప్తంగా ఈనెల 18న బందు పర్ జస్టిస్ ను విజయవంతంగా పాటించండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో జీవో నెంబర్ 9 చట్టం చేసింది. అయితే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలకు తీవ్ర నిరాశ కలిగించింది. ఈ పరిణామం బీసీలపై జరిగిన అన్యాయం స్పష్టమని బీసీ ఐక్యత బలాన్ని చూపించాల్సిన అవసరం ఎంతో ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నారు. బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంధు పర్ జస్టిస్ వ్యాప్తంగా శాంతియుతంగా విజయవంతం నిర్వహించాలి ఇది కేవలం బీసీలకే కాదు సామాజిక న్యాయం కోరే ప్రతి ఒక్కరి ఉద్యమం అని ఆయన పిలుపునిచ్చారు. అన్ని బీసీ సంఘాలు ఉద్యోగ సంఘాలు విద్యార్థి సంఘాలు యువజన సంఘాలు అలాగే అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు ఏకతాటి పైకి వచ్చి ప్రతి ఒక్క షాపులను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పని నరసింగం ,ఉపాధ్యక్షులు సీర్ల శ్రీనివాస్ ,కార్యదర్శి ఆకుల మహేందర్ గౌడ్, సలహాదారుడు దేశరాజు సత్తయ్య ,కళాకారుల మండల అధ్యక్షులు నేరెళ్ల ముత్యం గౌడ్, దేశరాజు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ ముందే ఒక వ్యక్తిపై చాకుతో దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ కే. మొగిలి తెలిపారు. ?సీఐ కే. మొగిలి వెల్లడించిన ప్రకారం.. కందికట్కూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్ మరియు నక్క రవి అనే వ్యక్తుల మధ్య గత కొంతకాలంగా డబ్బుల లావాదేవీల కారణంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గతంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ?గురువారం ఉదయం గ్రామ పంచాయతీ ముందు ఈ విషయంపై మరోసారి ఘర్షణ తలెత్తింది. డబ్బుల విషయంలో విసిగిపోయిన నక్క రవి, జక్కుల శ్రీనివాస్‌ను చంపేయాలనే ఉద్దేశంతో వెంట తెచ్చుకున్న కూరగాయలు కత్తిరించే చాకుతో అతనిపై దాడి చేశాడు. ?ఈ దాడిలో శ్రీనివాస్ చేతికి మరియు గదవ (దవడ) పై తీవ్ర రక్త గాయాలయ్యాయి. వెంటనే బాధితుడు జక్కుల శ్రీనివాస్ ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ?కేసు నమోదు అనంతరం, సిరిసిల్ల రూరల్ సీఐ కే. మొగిలి విచారణ చేపట్టి నిందితుడైన నక్క రవిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన నిందితుడిని న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం తరలించినట్లు సీఐ కే. మొగిలి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ సమావేశం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం అక్టోబర్17 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్లో నిర్వహిస్తునట్టు జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ తెలిపారు. ఈకార్యక్రమానికి అతిధులుగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి, మై భారత్ పోర్టల్ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ అన్వేశ్ వ్యవహరిస్తారని, అతిధులుగా జాతీయ సేవ పథకం వరంగల్ కన్వీనర్ డాక్టర్ ఎం.రామ్ బాబు, జాతీయ సేవా పథకం జనగామ జిల్లా కన్వీనర్ డాక్టర్ జంబు, జాతీయ సేవ పథకం మహాహబూబాబాద్ కన్వీనర్ ఎం. అనిల్, జాతీయ సేవ పథకం ములుగు జయశంకర్ భూపాలపల్లి జాతీయ సేవ పథకం కన్వీనర్ సిహెచ్ ప్రసన్న కుమార్ హాజరవుతారని తెలిపారు.

# సిపిఆర్ పై అవగాహన సదస్సు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో జాతియా వ్యాప్త "కార్డియో పుల్మనరి రేససిఎషన్ సిపిఆర్" పై అవగాహనా కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 17 శుక్రవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు, విశ్వవిద్యాలయ సెనెట్ హాల్లో నిర్వహిస్తునట్టు, యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం మెంబెర్ ఇంచార్జ్ ఆచార్య ఎన్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిదిగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిధులు గా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో పాటు నగంరం లోని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామక శ్రీనివాస్ చే "సి.పి. ఆర్. పై ప్రయోగ పూర్వక అవగాహనా కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత బోధనా, బోధనేతర సిబ్బంది హాజరు కావాలని ఆచార్య ఎన్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# లోగో ఆవిష్కరించిన సీఎం

భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డి, హెూం శాఖ స్పెషల్ సీఎస్ సీ.వి. ఆనంద్, సీజీఎం డీజీ రవి గుప్త, పోలీస్ కంప్లెయింట్ అథారిటీకి చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్ రావు మరియు ఇతర సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ వెబ్ సైట్ పోలీస్ శాఖలో అవినీతిని అరికట్టడానికి సహాయపడుతుంది" అని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అధికార సంస్థ పోలీస్ కంప్లెయింట్ అథారిటీ పోలీస్ వ్యవస్థలో ఫిర్యాదులు, అన్యాయాలను పరిష్కరించేందుకు ఏర్పాటైన స్వతంత్ర సంస్థ. ఈ వెబ్ సైట్ ద్వారా ప్రజలు ఆన్లైన్లో ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు, వాటి స్థితిని తెలుసుకోవచ్చు. లోగో డిజైన్ పారదర్శకత, న్యాయాన్ని సూచిస్తుంది. ఈ ఆవిష్కరణ తెలంగాణలో పోలీస్ సంస్కరణలలో భాగంగా జరిగింది. ప్రభుత్వం డిజిటల్ ప్లాట్ఫామ్ల ద్వారా సేవలను మెరుగుపరుస్తోంది.పోలీస్ కంప్లెయింట్ అథారిటీ చైర్మన్ జస్టిస్ శివశంకర్ రావు, "ఈ వెబ్ సైట్ ప్రజలు, పోలీసుల మధ్య విశ్వాసాన్ని పెంచుతుంది" అని తెలిపారు. పోలీస్ కంప్లెయింట్ అథారిటీకి వెబ్ సైట్ త్వరలో అందుబాటులోకి వస్తుంది. ఇందులో ఫిర్యాదు దాఖలు, స్థితి ట్రాకింగ్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇది పోలీస్ శాఖలో అవినీతి నిర్మూలనకు దోహదపడుతుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యం, రాజస్వం, క్రీడల రంగాల్లో డిజిటల్ పథకాలను ప్రవేశపెట్టింది. ఈ ఆవిష్కరణ ఆ శ్రేణిలో భాగం. ఈ కార్యక్రమం తెలంగాణ పోలీస్ వ్యవస్థలో సంస్కరణలకు కొత్త ఊపు ఇస్తోంది.

# సుమంత్ విషయం నాకు తెలియదు

తన బిడ్డకు పదవి ఏమీ లేదని, ఏ పార్టీలోనూ ఆమె లేదని స్పష్టం చేశారు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో తాను, సురేఖ వెళ్తామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్నారని, ఇస్తారని పేర్కొన్నారు. ఆయన మాట తప్పరని నమ్ముతున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రి పొంగులేటి తమ ఇంటికి వచ్చారన్నారు. తననెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి ప్రశ్నించారు.

# హైకోర్ట్ బోగస్ ఓట్లపై కీలక వ్యాఖ్యలు

## – ఏ విధమైన ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టం




డెస్క్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలుచేసిన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. హైకోర్టు, ఇప్పటికే ఎలక్టోరల్స్ ఈసీ రివిజన్ చేస్తోందని, ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుత సందర్భంలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది. బీఆర్ఎస్ తరుపు న్యాయవాది, జూబ్లీహిల్స్తో సంబంధంలేని వ్యక్తులు ఓటరు జాబితాలో చేరారని వాదించారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని తెలిపారు. ఈసీ తరుపు లాయర్, బీఆర్ఎస్ రిప్రజెంటేషన్లపై ఎన్నికల అధికారి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని, నివేదికను బట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విధంగా, హైకోర్టు నిర్ధారించినది ఏమిటంటే, బోగస్ ఓట్ల పై విచారణ కొనసాగుతున్నా, అదనపు న్యాయ ఆదేశాలు ఇవ్వడం ఈ దశలో అవసరం లేదని. ప్రస్తుతం ఈసీ తానికే తగిన చర్యలు తీసుకుంటుందని హైకోర్టు స్పష్టీకరించింది.

# వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా..?

## – మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ 'ఎక్స్' వేదికగా సీపీ సజ్జనార్ పోస్ట్

**వేద న్యూస్, హైదరాబాద్:**



యూట్యూబ్ ఛానళ్లపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. లైక్స్ , వ్యూస్ మాయలో పడి విలువలను మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్తో సామాజిక మాధ్యమాల్లో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవితను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వీసీ సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ను చేస్తూ, సభ్య సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారు? చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదపడండి. అంతేకానీ ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించే పనులు చేయొద్దు. గుర్తు పెట్టుకోండి. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు, చట్టరీత్యా నేరం కూడా అని ఎక్స్ లో సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ను చేయడం లాంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమేనని సీపీ సజ్జనార్ ఎక్స్ లో పేర్కొన్నారు. పిల్లలను ఇలాంటి కంటెంట్లో భాగం చేయడం, వారిని వేధించడం కిందికే వస్తుందని తెలిపారు. మైనర్లతో ఈ తరహా కంటెంట్ ను చేసే వారి పట్ల పోలీస్ శాఖ చాలా కఠినంగా వ్యవహరిస్తుందని సీపీ సజ్జనార్ 'ఎక్స్' లో తెలిపారు. అలాంటి వాటికి సంబంధించిన బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. తక్షణమే వీటిని తొలగించకున్నా, భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్లోడ్ చేసినా చట్టప్రకారం కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.కాగా సీపీ హెచ్చరికతో పలువురు వీడియోలను తొలగించారు. అలా తొలగించడంతో మళ్లీ స్పందించిన సీపీ వీడియోలను తొలగిస్తే అంతా అయిపోదు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అంటూ పోస్టు చేశారు.

# నా ఆలోచనలు,ఇబ్బందులు వాళ్లకు చెప్పాను

**వేద న్యూస్, హైదరాబాద్:**




తోటి మంత్రులతో వివాదం, తాజా పరిణామాలపై మంత్రి కొండా సురేఖ, కూతురు సుస్మితతో కలిసి ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో భేటీ అయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగిన ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ తనపై జరగుతోన్న కుట్రలను మీనాక్షి నటరాజన్ కు వివరించినట్లుగా సమాచారం. భేటీ అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ తోటి మంత్రులతో తాను పడుతోన్న ఇబ్బందులు, ఆలోచనలు మీనాక్షి నటరాజన్ కు వివరించినట్లు తెలిపారు. వారు కూడా తన అభ్యర్థనను విని మంత్రులతో కూర్చొని మాట్లాడి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. తన బాధలు అన్ని వారితో పంచుకున్నానని, వాళ్లు ఇచ్చిన ఆదేశాల మేరకు తాను ముందుకు వెళ్తానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# కాలేయపు చీము తొలగింపు

## - ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో.. - చక్కటి వైద్య సేవలందించిన డాక్టర్ వి.కార్తీక్‌రెడ్డి

**వేద న్యూస్, జమ్మికుంట:**



ఓ పేషెంట్‌కు(పేరు గోప్యం) లివర్ అబ్సెస్ రాగా, జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుడు డాక్టర్ వి.కార్తీక్‌రెడ్డి గురువారం చక్కటి వైద్య సేవలందించారు. ట్రీట్‌మెంట్ అనంతరం ప్రస్తుతం పేషెంట్ హాస్పిటల్‌లో వైద్యుల అబ్జర్వేషన్‌లో ఉన్నారు. కాలేయంలోని ఏర్పడిన చీమును డాక్టర్ వి.కార్తీక్‌రెడ్డి ఎంబీబీఎస్ ఎంఎస్ ఎఫ్ఎంఏఎస్, జనరల్, ల్యాపరస్కోపిక్ సర్జన్ తొలగించారు. లివర్ అబ్సెస్ డ్రెయినేజీని విజయవంతంగా క్లియర్ చేయడంతో పేషెంట్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చక్కటి వైద్య సేవలను అందించారని వెల్లడించారు.

# కేబినెట్ మీటింగ్‌కు దూరంగా నిలిచిన కొండా సురేఖ

- కారణాలపై రాజకీయ వర్గాల్లో చర్చ
- మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరు అయిన సురేఖ
- కాంగ్రెస్‌లో అంతర్గత ఉద్రిక్తతలేనా?
- రేవంత్ కేబినెట్‌లో ఖాళీ కుర్చీ
- సురేఖ దూరం కొత్త రాజకీయ సంకేతమా?

డెస్క్ : తెలంగాణ సచివాలయంలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనేక కీలక అంశాలపై చర్చకు వేదికైంది. బీసీ రిజర్వేషన్ల అమలు, ఎస్ఎల్బీసీ పనుల ప్రారంభం, కాళేశ్వరం రీడిజైన్ ప్రాజెక్టు, అభివృద్ధి పథకాలపై వేగవంతమైన నిర్ణయాలు చేపట్టే దిశగా ఈ సమావేశం జరిగింది. అయితే ఈ కీలక సమావేశానికి ఒక్క మంత్రి కొండా సురేఖ మాత్రమే గైర్హాజరుకావడం ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. సమావేశానికి ముందు కొండా సురేఖ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసి మాట్లాడటం అర్థాలనిస్తోంది. పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరిపిన వెంటనే కేబినెట్ మీటింగ్‌కు హాజరుకాకపోవడం ఆమె వైఖరిపై వివిధ రకాల ఊహాగానాలకు దారితీసింది. ఇది కేవలం వ్యక్తిగత కారణమా, లేదా పార్టీ విధానాలపై అసంతృప్తికి సంకేతమా అన్న ప్రశ్న చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో కొండా సురేఖ చుట్టూ వివాదాలు తగ్గడం లేదు. ఆమెకు ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ప్రభుత్వం సిమెంట్ కంపెనీలను బెదిరించిన ఆరోపణలతో తొలగించడం పెద్ద వార్తగా మారింది. ఆ ఘటనతో ఆమె రాజకీయ ఇమేజ్‌పై విమర్శలు వచ్చాయి. దానికితోడు మేడారం జాతర ఏర్పాట్ల విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఈ పరిణామాల సమాహారంగా ఆమె ప్రతి అడుగు ఇప్పుడు ప్రత్యేకంగా గమనించబడుతోంది.

సురేఖ పార్టీకి దూరమవుతున్నారా? లేక అంతర్గతంగా ఏదైనా చర్చలు కొనసాగుతున్నాయా అనే ప్రశ్నలపై ప్రభుత్వ వర్గాలు మౌనం పాటిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మహేశ్ కుమార్ గౌడ్ ఆమెతో మాట్లాడతానని చెప్పిన వ్యాఖ్యలు మరో కోణాన్ని తెరమీదకు తీసుకువస్తున్నాయి. కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమేనని వ్యాఖ్యానించినప్పటికీ, ఆమె గైర్హాజరు రాజకీయ సందేశాలుగా పరిగణించబడుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల చర్చ వేడెక్కుతున్న వేళ, కొండా సురేఖ వంటి ప్రముఖ నేతల వైఖరి కాంగ్రెస్‌కు వ్యూహాత్మకంగా కీలకం. ఆమె హాజరు లేకపోవడం తాత్కాలిక పరిణామమా, లేక లోతైన అసంతృప్తి సంకేతమా అన్నది రాబోయే రోజులలో స్పష్టంకానుంది.



వేద న్యూస్

శుక్రవారం అక్టోబర్ 17, 2025

# సంపాదకీయం

పేదరికం అంతమవ్వాలి అంటే మాటలు కాదు చర్యలు అవసరం

– పేదరిక నిర్మూలన ప్రపంచ లక్ష్యమే అయినా సాధారణ మనిషి జీవితంలో మార్పు ఇంకా దూరమే

పేదరికం అనే పదాన్ని మనం ప్రతిరోజూ వింటూనే ఉన్నాం. ప్రభుత్వ పథకాలు, అంతర్జాతీయ ప్రకటనలు, సదస్సులు, బహిరంగ ప్రసంగాలు అన్నీ పేదరిక నిర్మూలన గురించి మాట్లాడుతుంటాయి. కానీ నేల మీద పరిస్థితి ఏమిటి అన్నదే అసలు ప్రశ్న. కోట్లాది మంది ఇంకా ఆకలి బారిన పడుతున్నారు. చదువు, ఆరోగ్యం, వసతి, ఉపాధి వంటి కనీస హక్కులు వారికి అందని ద్రాక్షే అయ్యాయి. ఇవన్నీ చూస్తే, పేదరికాన్ని నిర్మూలించాలి అనే నినాదం నినాదంగానే మిగిలిపోతుందనే అనుమానం కలుగుతోంది.

పేదరికాన్ని గణాంకాలతో కొలుస్తారు. డాలర్లలో రేఖలు గీస్తారు. ఒక కుటుంబం రోజుకు రెండు డాలర్ల కంటే తక్కువతో జీవిస్తే పేదరిక రేఖ కింద ఉన్నవారని చెబుతారు. కానీ పేదరికానికి సంఖ్యలతో కొలవలేని ఒక నిజమైన బాధ ఉంది. అది కడుపు నింపుకోలేని బాధ, పిల్లలకు పాలు పట్టలేక విలవిలలాడే తల్లి బాధ, పాఠశాలకు వెళ్లలేని చిన్నారి బాధ. ఈ బాధను దగ్గరగా చూసినవారే పేదరికం అంటే ఏమిటో అర్థం చేసుకోగలరు.

అంతర్జాతీయ స్థాయిలో పేదరికాన్ని తగ్గించడానికి అనేక ప్రణాళికలు తీసుకువచ్చారు. సహాయ నిధులు విడుదలయ్యాయి, అభివృద్ధి పేరుతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. కానీ ఈ కృషి అంతా పేదవాడి తలుపు తట్టేంతగా పనిచేసిందా? ప్రభుత్వ కార్యాలయాల్లో, సమావేశాల హాళ్లలో పథకాలు పుట్టినా, అవి పేదవాడి జీవితానికి చేరుకునేలోపు దారి తప్పుతున్నాయనే వాస్తవాన్ని ఒప్పుకోవాల్సిందే. పేదరికం కేవలం డబ్బు సమస్య కాదు, అది అవకాశాల కొరత కూడా. ఒక పేద కుటుంబంలో పుట్టిన బిడ్డకు అందే అవకాశాలు, సౌకర్యాలు, మార్గదర్శకత్వం అన్నీ పరిమితమే. అతను ఎంత కష్టపడినా సమాన స్థాయిలో పోటీ చేయడం కష్టసాధ్యం. ఇది ఆర్థిక అసమానతకు అసలు స్వరూపం. ఈ అసమానతనే పేదరికానికి మూల కారణంగా గుర్తించాలి.

పేదరికం తగ్గించాలంటే కేవలం సహాయధనాలు ఇవ్వడం కాదు, వ్యక్తికి స్వయం సంపాదనకు అవకాశం కల్పించాలి. విద్య, నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలు ఇవ్వడం ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది. కానీ ప్రస్తుత వ్యవస్థలో పేదవాడిని ఓటుగా చూస్తారు గానీ, సామర్థ్యంగా చూడడం తక్కువ. ఈ రాజకీయ దోరణే పేదరికాన్ని కొనసాగిస్తున్న అసలు శక్తి.

అంతర్జాతీయ పేదరహిత దినం లాంటి రోజులు అవగాహన పెంచవచ్చు. చర్చలు మొదలుకావచ్చు. కానీ అవగాహనతో పాటు బాధ్యత అనే భావన కూడా పెరగాలి. ప్రభుత్వాలు, సమాజం, సంస్థలు మాత్రమే కాదు, వ్యక్తిగత స్థాయిలోనూ మార్పు రావాలి. మన సమీపంలో ఉన్న పేదరికాన్ని గుర్తించి, చిన్నైనా సహాయం చేయడమే నిజమైన మార్పు ఆరంభం. పేదరికం మన దేశ గౌరవాన్నే కాదు, ప్రతి మనిషి గౌరవాన్ని కూడా దెబ్బతీస్తోంది. పేదరికం ఉన్నంతవరకు స్వాతంత్ర్యం సంపూర్ణం కాదు. పేద మనిషి కడుపు నిండకపోతే అభివృద్ధి గురించి మాట్లాడటం నాటకమే అవుతుంది. ప్రపంచంలో నంబర్ వన్ ఆర్థిక శక్తి అవ్వాలి అనే ఆకాంక్ష ముందు పేదరిక నిర్మూలనే మొదటి అడ్డంకి.

గ్రామాల్లో, పట్టణాల్లో, మెట్రో నగరాల గుండెల్లో కూడా పేదరికం మసక బారిన మూలల్లో కనిపిస్తుంది. మెరిసే భవనాల నీడలో ఆకలితో వాడిపోయే కళ్లను మనం గమనించడం లేదు. ఈ కళ్లలో కనిపించే నిశ్శబ్ద కోపమే ఒకరోజు సమాజం మొత్తం కదలికకు దారి కావచ్చు. పేదరిక నిర్మూలన ఒక రోజు లేదా ఒక పథకంతో సాధ్యంకాదు. ఇది ఒక నిరంతర ప్రక్రియ. సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన గౌరవం అందరికీ అందే వరకూ ఈ ప్రయాస కొనసాగాలి. అంతర్జాతీయ పేదరహిత దినం మనకు గుర్తు చేస్తున్న సందేశం ఇదే పేదరికాన్ని చూసి మౌనంగా నిలబడకూడదు, దాన్ని ఎదుర్కోవడానికి కలిసికట్టుగా ముందుకు రావాలి.

పేదరికం మీద పోరాటం కేవలం ప్రభుత్వాల బాధ్యతగా మిగలకూడదు. సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ ఏదో ఒక విధంగా పాత్ర పోషించగలరు. పక్కింటి బిడ్డ పాఠశాలకు వెళ్లేలా చేయడం, పని లేని వారికో చిన్న ఉపాధి అవకాశాన్ని చూపించడం, వృథాగా పడేసే ఆహారాన్ని అవుసరమైన వారికి అందించడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు బాటలు వేస్తాయి. మార్పు అనేది పెద్దపెద్ద వేదికలపై కాదు, నేల మీద మొదలవుతుంది అనే నిజాన్ని మళ్ళీ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. మన దేశంలో ప్రతిభకు కొదవలేదు, అవకాశం లేకపోవడమే ప్రధాన లోపం. పేదరికంలో పెరిగిన పిల్లలు తగిన ప్రోత్సాహం, దారి చూపే చేయి లభిస్తే అద్భుతాలు చేయగలరు. వారి కళ్లలో ఉన్న కలలు దుమ్ములో కూరుకుపోకుండా వాటికి వెలుగు పట్టడం మన సమాజపు బాధ్యత. ఒక పేదరికంలో ఉన్న బాలుడు ఉపాధి పొందినప్పుడు కేవలం ఒకరి జీవితం మారడం కాదు, ఒక తరం దిశ మారుతుంది.

అంతర్జాతీయ పేదరహిత దినం మనకు ఇచ్చే అసలు సందేశం ఇదే పేదరికాన్ని దానం పేరుతో దాచిపెట్టకూడదు, దాన్ని సమాన హక్కుల దారిలో ఎదుర్కోవాలి. పేదరికం ఉన్న మనిషికి సహాయం చేయడం కాదు, అతనికి అవకాశాన్ని ఇవ్వడం నిజమైన నిర్మూలన. మన విలువలు, మన విధానాలు, మన చూపే దృష్టి మారితేనే పేదరికం అనే పదం చరిత్ర పుటల్లోకి వెళ్లిపోతుంది. అదే నిజమైన అభివృద్ధి, అదే సమాజానికి గౌరవాన్నిచ్చే మార్గం.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,**
**డిజైనర్ టెక్ గురు. 8897975262**

# వీధి కుక్కల ఉగ్రరూపం

**- సమస్యపై అధికారుల నిర్లక్ష్యం**
**- గ్రామాల్లో అవగాహన లోపం మరణాలకు దారి**
**- రోజురోజుకూ తీవ్రమౌతున్న వీధి కుక్కల బెడద**
**- రేబిస్ మరణాలు పెరుగుతున్నా స్పందన లేదు**
**- శాశ్వత పరిష్కారం కోసం ప్రజల డిమాండ్**
**- జరిగిన తర్వాత కాదు, ముందు చర్య" అంటూ ప్రజల ఆగ్రహం**



డెస్క్ : పట్టణాల్లోనూ గ్రామాల్లోనూ వీధి కుక్కల సంఖ్య అదుపుతప్పేలా పెరుగుతోంది. రాత్రివేళ బయటకు వెళ్లే వారిపైనా, ఉదయాన్నే పనిమీద బయల్దేరే మహిళలపైనా ఇవి దాడులకు తెగబడుతున్నాయి. ఎవరైనా ఆహారం కోసం దగ్గర వెళ్లినా అప్పుడే గుంపులుగా చేరి కరవడం సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఈ దాడులు ఒకటి రెండు కాదు, ప్రతి వారమూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. కుక్కల కాటు కేసులు పెరుగుతున్నా, సమయానికి టీకాలు వేయించకపోవడం వల్ల రేబిస్ వంటి ప్రమాదకర రోగాలు వ్యాపిస్తున్నాయి. ఒకసారి లక్షణాలు బయటపడితే ప్రాణాలు కాపాడటం అసాధ్యం. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు బాధితులు తీవ్రమైన నొప్పితో కృంగిపోతున్నారు. గ్రామాల్లో అయితే కరవబడినప్పటికీ విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత విషమంగా మారుతోంది.

రాత్రివేళ వీధుల్లో తిరిగే కుక్కలు కాంతి కనిపించగానే లేదా కదలిక గుర్తించిన వెంటనే దాడి చేస్తాయి. చిన్నారులు, వృద్ధులు వీటి టార్గెట్ అవుతున్నారు. పాఠశాలకు వెళ్లే పిల్లలు భయంతో తిరిగి ఇళ్లకు చేరిపోవాల్సిన పరిస్థితి వస్తోంది. తమ పిల్లలు బయటకు వెళు న్న ప్రతి క్షణం తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా తిరిగే కుక్కలు పండుగలు, సభలు, జాతరలప్పుడు మనుషుల మధ్యకు చేరి ఆహారం కోసం అల్లరిచేస్తుంటాయి. ఎవరు తప్పించుకునే ప్రయత్నం చేసినా వెంటనే కొరికేస్తున్నాయి. చాలాసార్లు ఈ ఘటనలు పెద్దగా వెలుగు చూడకుండానే ముగుస్తున్నాయి. స్థానికంగా కొద్దిపాటి చికిత్స చేసి మామూలైపోతుందని వదిలేస్తున్నారు.

మనుషుల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో కుక్కల సంఖ్య కూడా అధికంగా ఉంది. చెత్త వేయే ప్రదేశాలు, ఆహారం పడే మూలలు వీటికి స్థావరాలుగా మారాయి. శుభ్రత లేకపోవడం వీటి పెరుగుదలకి పెద్ద కారణంగా మారింది. ఎప్పటికప్పుడు మురుగు, చెత్త పేరుకుపోతున్నా ఎవరూ శుభ్రం చేసే ప్రయత్నం చేయకపోవడం బాధాకరం. కరవబడిన వెంటనే సరైన టీకాలు వేయించకపోతే రేబిస్ దాడికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలామంది ఈ ప్రమాదాన్ని తేలికగా తీసుకుంటున్నారు. కుక్క కరిచిందంటే చిన్న గాయం అని పట్టించుకోకపోవడం వల్ల కాలక్రమంలో పరిస్థితి ప్రాణాంతకంగా మారుతోంది.

**– సమస్యపై అధికారుల నిర్లక్ష్యం**

అధికార సంస్థలు కూడా ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా పెద్ద ఘటన జరిగితే వెంటనే పట్టుకోవడం, వాహనాల్లో తీసుకెళ్లడం వంటి తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నారు. కానీ కుక్కలకు స్టెరిలైజేషన్, టీకా కార్యక్రమాలు వంటి శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఫలితంగా సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతోంది.

**– గ్రామాల్లో అవగాహన లోపం మరణాలకు దారి**

గ్రామాల్లో అయితే కుక్కల కాటు ప్రమాదాలపై అవగాహన కూడా లేదు. కరవబడినా స్థానికంగా పట్టుమని చికిత్స చేయకుండానే వారు రోజువారీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కొన్ని రోజుల తరువాత రేబిస్ లక్షణాలు బయటపడినప్పుడు



ఆసుపత్రికి తీసుకెళ్లినా ఆలస్యం అయిపోతుంది. ఈ నిర్లక్ష్యం వల్ల అనేక ప్రాణాలు వృథా అవుతున్నాయి.

ప్రజలు భయంతో సాయంత్రం తరువాత బయటకు రావడానికి కూడా సంకోచిస్తున్నారు. పిల్లలు ఆడుకునే కాలనీలూ, గ్రామాల్లోని ఖాళీ మైదానాలూ నిశ్శబ్దంగా మారిపోయాయి. ఒకప్పుడు ప్రాణాలతో కళకళలాడే వీధులు ఇప్పుడు కుక్కల గుంపులతో నిండి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై ఇప్పటికైనా పక్కా ప్రణాళికలు రూపొందించాలని అందరూ కోరుతున్నారు. శుభ్రత చర్యలు, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు, తక్షణ టీకాలు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టకపోతే పరిస్థితి మరింత నియంత్రణలోకి రానంటున్నారు స్థానికులు.

**– శాశ్వత పరిష్కారం కోసం ప్రజల డిమాండ్**

ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నప్పటికీ ఇప్పటికీ సంబంధిత శాఖలు కేవలం గణాంకాలు సేకరించడానికే పరిమితమవుతున్నాయి. ఒకసారి ప్రమాదం జరిగిందంటే వెంటనే పట్టుకోవడం, మీడియా దృష్టి తగ్గిన వెంటనే వదిలేయడం ఇదే శైలి కొనసాగుతోంది. ప్రజల రక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందనేది అధికారులు గుర్తించాలి. ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో స్టెరిలైజేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి కుక్కల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఘాటుగా డిమాండ్ చేస్తున్నారు. కరవబడిన వారికి ఉచిత టీకాలు, తక్షణ వైద్య సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎన్నికలప్పుడు మాదిరిగానే ఓట్ల కోసం మాత్రమే చూసే ప్రభుత్వ ధోరణిపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒక ప్రాణం కూడా విలువైనదే అయితే ఎందుకు ఇంత నిర్లక్ష్యం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కుక్కల బెడదపై ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి, గ్రామ స్థాయిలో పహారా బృందాలు ఏర్పాటు చేసి, ఆసుపత్రుల్లో రేబిస్ మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టమైన హామీ ఇవ్వాలని జనాలు డిమాండ్ చేస్తున్నారు. "ప్రాణం పోయిన తర్వాత విచారణ కమిటీ కాదు, ప్రాణం పోకుండా ముందే చర్య" ఇదే ప్రజల గట్టిబేరం.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,**
**(డిజైనర్ టెక్ గురు) 8897975262**

# పర్యావరణ పరిరక్షణ: మన భవిష్యత్తును కాపాడే బాధ్యత

డెస్క్ : ప్రకృతి మన జీవితానికి ఇవ్వగలిగిన అత్యంత విలువైన బహుమతులు గాలి, నీరు, మట్టిపెద్ద, చెట్లు, జంతువులు ఇవన్నీ మన ఆరోగ్యానికి, మన జీవన విధానానికి మూలాధారం. కానీ, నేటి కాలంలో మానవ చర్యల వల్ల ఈ ప్రకృతి వనరులు వేగంగా నాశనానికి గురవుతున్నాయి. పారిశుద్ధ్య సమస్యలు, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం, ఫ్యాక్టరీలు, వాహనాల నుండి వచ్చే విష వాయువులు ఇవన్నీ మన పర్యావరణాన్ని హాని చేస్తూ, భవిష్యత్తు తరం మీద ప్రమాదాలను పెంచుతున్నాయి.

**– వాయు కాలుష్యం: మన ఊహాకంటే ఎక్కువ ప్రమాదం**

ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. వాహనాలు, ఫ్యాక్టరీలు, దుమ్ము ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం. కరోనా సమయంలో కూడా మనం గమనించాం వాయు కాలుష్యం తగ్గడం వల్ల కొంత సమయం వరకు ప్రజల ఆరోగ్యం మెరుగైంది. కానీ వాయు కాలుష్యం నిరంతరం ఉంటే శ్వాసకోశ సమస్యలు, అలెర్జీ, ఊపిరితిత్తుల వ్యాధులు పెరుగుతాయి.

**– నీటి సమస్యలు: వనరుల అవినియోగం**

ప్రతి మనిషి జీవితానికి నీటి ప్రాముఖ్యత అవిశేషం. కానీ, పరిశ్రమల నుంచి వచ్చే రసాయనాలు, ప్లాస్టిక్ వాడకం, అసహ్యమైన వ్యర్థాలు ఇవన్నీ మన తాగునీరు, నదులు, సరస్సులను కాలుష్యరహితంగా ఉండే అవకాశం తగ్గిస్తున్నాయి. ఉదాహరణకి, గంగా, కృష్ణ, యమునా వంటి ప్రధాన నదులు మానవ కారణాల వల్ల ప్రమాదకరంగా కాలుష్యం చెందుతున్నాయి.

**– చెట్లు, వనాలు మరియు జీవవైవిధ్యం**


వనాలు మన జీవన విధానానికి ఆక్సిజన్ ఉత్పత్తి, వర్షపాతం నియంత్రణ, వాతావరణ సంతులనం వంటి ముఖ్యమైన విధులు నిర్వహిస్తున్నాయి. కానీ చెట్లను నాశనం చేయడం, అడవులను కత్తిరించడం ఇవి పర్యావరణం మీద తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. చెట్లను నాటడం, వనాలను కాపాడటం, అడవి జంతువుల సంరక్షణ ఇవి మన బాధ్యతలో ప్రధాన భాగం.

**– మన చేతిలో ఉన్న పరిష్కారాలు**

**ప్రతి మనిషి చిన్న చిట్కాలు** పాటించడం ద్వారా పెద్ద మార్పులు తీసుకురాగలడు. ఉదాహరణకి:

చెట్లు నాటడం, పర్యావరణ స్నేహపూర్వక వృక్షాల కోసం ప్రోత్సాహం.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం.



గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి వాహనాల వాడకంలో నియంత్రణ.

నీటిని పొరపాటు లేకుండా, అవసరానికి సరిపడే విధంగా వాడడం.

ప్రపంచ దేశాలు ఇప్పటికే "గ్రీన్ ఎనర్జీ" పథకాలు అమలు చేస్తూ, సౌరశక్తి, గాలి శక్తి, విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయి. మన దేశంలో కూడా ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణలో ముందడుగు వేస్తున్నాయి.

**– భవిష్యత్తు తరానికి కర్తవ్యం**

పర్యావరణాన్ని కాపాడకపోతే, భవిష్యత్తు తరం అనారోగ్య సమస్యలు, ఆహార లోపాలు, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి మనిషి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అవ్వాలి. ప్రతి చిన్న మార్పు, ప్రతి చిట్కా ఇవన్నీ పెద్ద ప్రభావాన్ని చూపగలవు.

**– సారాంశం**

మన జీవితం, మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు ఇవన్నీ పర్యావరణ పరిరక్షణకు నేరుగా అనుసంధానంగా ఉన్నాయి. చెట్లు, నీటి బిందువులు, శు భ్రమైన గాలి ఇవన్నీ మన ఆరోగ్యం, మన ఆనందం, మన జీవన స్థాయి కోసం అవసరం. కాబట్టి మనం ప్రతి ఒక్కరం, చిన్నతనపు బాధ్యతలను కూడా పూజించాలి. ప్రతి రోజు, ప్రతి చిన్న చర్య పర్యావరణాన్ని కాపాడటానికి సహాయపడుతుంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073